## ఉట్నూర్ ఐటీడీఏలో

# 'ట్రైనీ కలెక్టర్ల' సందడి

- క్షేత్రస్థాయిలో అభివృద్ధి పరిశీలన
- వ్యవసాయ నేపథ్యం ఉన్న అధికారులు

ప్రశ్నలతో సందడిగా మారిన ఉద్యానవనం



7


# ప్రభాత సమాచారం

https: epaper.
prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

■ శనివారం | 4 ఏప్రిల్ 2026 | ■ 10 పేజీలు


■ ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తున్న క్యాతన్‌పల్లి మరియు ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల పరోక్ష ఎన్నికకు సమయం ఆసన్నమైంది. గత కొంతకాలంగా నెలకొన్న రాజకీయ అనిశ్చితికి తెరదించుతూ, హైకోర్టు ఉత్తర్వుల మేరకు శనివారం (ఏప్రిల్ 4న) ఈ ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య, సబ్ కలెక్టర్ మనోజ్ శుక్రవారం క్యాతన్‌పల్లి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి, భద్రతా ఏర్పాట్లు మరియు ఎన్నికల నిర్వహణపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 800 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మరోవైపు, సంఖ్యా బలం పరంగా బీఆర్ఎస్-సీపీఐ కూటమి పటిష్టంగా ఉన్నప్పటికీ, అధికార కాంగ్రెస్ పార్టీ ఎక్స్ అఫీషియో ఓట్లతో తమ వంతు ప్రయత్నాలు చేస్తోంది. క్యాంపుల నుంచి కౌన్సిలర్లు నేరుగా కార్యాలయానికి చేరుకోనుండటంతో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.




# మున్సిపల్ 'పీఠం' ఎవరికో..!

## ఖానాపూర్, క్యాతన్‌పల్లి చైర్మన్ ఎన్నికకు సర్వం సిద్ధం




- హైకోర్టు ఆదేశాలతో అనివార్యమైన ఎన్నిక..
- మరికొద్ది గంటల్లో ముగియనున్న సందిగ్ధం
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య పరోక్ష ఎన్నిక..
- మున్సిపల్ కార్యాలయాల వద్ద 163 సెక్షన్ అమలు
- క్యాంపుల నుంచి నేరుగా సభకు బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు.
- ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించనున్న అదనపు కలెక్టర్ చంద్రయ్య, సబ్ కలెక్టర్ మనోజ్, ఖానాపూర్ ఏర్పాట్లు చేసిన అధికారులు
- మ్యాజిక్ ఫిగర్ కోసం రెండు పార్టీల పాట్లు..
- కాంగ్రెస్ ఖాతాలోకి ఖానాపూర్ బల్దియా
- కౌన్సిలర్ కిడ్నాప్‌తో మారుతున్న రాజకీయ సమీకరణలు..
- పట్టు బిగిస్తున్న గులాబీ శ్రేణులు, ఆశలు వదలని హస్తం
- రెండు మున్సిపాలిటీలకు చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక


........లోపలి పేజీల్లో






10

# సర్పంచ్ ఆత్మహత్య

మాసాయిపేట గ్రామంలో విషాదఛాయలు

ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో

## ఫుడ్ పాయిజన్



- ఆరుగురు విద్యార్థులు, ఉపాధ్యాయుడికి తీవ్ర అస్వస్థత..
- రాత్రి మిగిలిన సాంబార్‌తిని అస్వస్థతకు గురై..
- పెంచికల్‌పేట పీహెచ్‌సీలో డాక్టర్లు లేకపోవడంతో కాగజ్‌నగర్‌కు తరలింపు

3

# కార్యకర్తలే కాంగ్రెస్ 'కోట'కు పునాది

ప్రభాత సమాచారం, మంచిర్యాల ప్రతినిధి

కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే అసలైన బలమని, పదేళ్ల పాటు జెండా మోసి కష్టపడిన వారికి పదవుల్లో సముచిత స్థానం కల్పిస్తామని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాలులో నిర్వహించిన జిల్లా కాంగ్రెస్ కమిటీ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేకానంద, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావుతో కలిసి నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చినప్పటికీ, సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని స్పష్టం చేశారు.

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం
- ఎనిమిది లక్షల కోట్ల అప్పులున్నా.. సంక్షేమాన్ని వదలని ముఖ్యమంత్రి రేవంత్ సర్కార్
- సింగరేణి నిధులు ఇకపై జిల్లా అభివృద్ధికి మాత్రమే
- మంత్రి గడ్డం వివేకానంద
- జెండాలు మోసిన కార్యకర్తలకు పదవుల్లో పెద్దపీట




10

# ఆదిలాబాద్‌కు 'అభివృద్ధి' వరం

2

- 6న పిప్రిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ
- రూ.1200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన
- బాసర ఆలయ అభివృద్ధికి రూ.300 కోట్లు..
- జిల్లా వ్యాప్తంగా రూ.600 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రులు జూపల్లి, వివేక్



సీఎం రేవంత్ రెడ్డి ఈనెల 6న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో నిర్వహించే భారీ బహిరంగ సభకు జిల్లా యంత్రాంగం, పార్టీ శ్రేణులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాయి. శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి వివేక వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారని మంత్రులు వెల్లడించారు.







# ఆదిలాబాద్‌కు 'అభివృద్ధి' వరం

- 6న పిప్పిరిలో సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభ
- రూ.1200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన
- బాసర అభివృద్ధికి రూ.300 కోట్లు
- జిల్లా వ్యాప్తంగా రూ.600 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్న సీఎం రేవంత్ రెడ్డి
- సభా ప్రాంగణాన్ని పరిశీలించిన మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక వెంకటస్వామి..
- అధికారులకు కలెక్టర్ రాజర్షి షా కీలక ఆదేశాలు..





**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ జిల్లా బజార్‌హత్నూర్ మండలం పిప్రి గ్రామంలో ఈనెల 6న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, స్థాని క శాసనసభ్యుడు అనిల్ జాదవ్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రే మ్‌సాగర్‌రావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా తదితరులతో కలిసి సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి ఈనెల 6న ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారని తెలిపారు. బోథ్ నియోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల వ్యయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేయనున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. అలాగే బాసర సరస్వతి దేవాలయ అభివృద్ధికి రూ. 300 కోట్లు, 2027 గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లతో కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా రూ.600 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరగనున్నాయని తెలిపారు. సభకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

**పిప్పిరి సభను విజయవంతం చేయాలి**
**మంత్రి వివేక్ వెంకటస్వామి**

సీఎం పర్యటన దృష్ట్యా ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, పార్టీ శ్రేణులకు సూచించారు. జిల్లా అభివృద్ధికి ఈ సభ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, తాగునీరు వంటి సౌకర్యాలను సమకూర్చాలని ఆదేశించారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధిపై సీఎం దృష్టి**
**ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. సాగునీటి, విద్యా రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూ సుమారు రూ. 600 కోట్ల పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు వెల్లడించారు. పిప్రి సభలో కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటన రైతులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పిప్రి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మంజూరు అయితే ప్రాంతం సస్యశ్యామలం అవుతుందని తెలిపారు. అభివృద్ధి విషయంలో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.

**ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**
**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈనెల 6న మధ్యాహ్నం 2:00 గంటలకు హెలిప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చేరుకుని, అనంతరం సభా ప్రాంగణంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరిస్తారని తెలిపారు. సభలో ప్రసంగంతో పాటు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ జరుగుతుందని పేర్కొన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజీ చెక్కులు, సీఎం కప్ అవార్డుల ప్రదానం, గ్రామ పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికేషన్లు అందజేయనున్నట్లు వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని సూచించారు. పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సభలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో యువరాజ్ మర్మాట్, అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



## మంచిర్యాలలో మంత్రులకు
## ఆత్మీయ స్వాగతం పలికిన కలెక్టర్

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

పట్టణంలో పలు కార్యక్రమాలకు హాజరయ్యేందుకు జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర ఆబ్కారీ – మధ్య నిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద, టి.పి.సి.సి. ప్రతినిధి మహేష్ కుమార్ లను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, మంచిర్యాల నియోజకవర్గ శాసనసభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుతో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు.

## మహంకాళి జాతరలో ఎమ్మెల్యే కోవ లక్ష్మి ప్రత్యేక పూజలు

**రెబ్బెన, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**



కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలం ఇందిరా నగర్ గ్రామంలోని స్వయంభూ శ్రీ కనకదుర్గా దేవి శ్రీ మహంకాళి దేవస్థానంలో శుక్రవారం మహంకాళి జాతర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. అమ్మవారి జన్మదినం సందర్భంగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించుకోగా, ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో నిండిపోయాయి. ఆలయ కమిటీ అధ్యక్షుడు మోడం తిరుపతి గౌడ్, ఆలయ ప్రధాన అర్చకులు దేవర వినోద్ స్వామి, కమిటీ సభ్యులు ఎమ్మెల్యే కోవా లక్ష్మిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు , ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి కల్యాణం

**కోటపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**



కోటపల్లి మండలం జనగాం గ్రామపంచాయతీ శివరాంపల్లిలో శుక్రవారం శ్రీ రాజరాజేశ్వర స్వామి కళ్యాణ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కళ్యాణ మహోత్సవంలో భక్తులు పెద్దఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ పంచాయితీ తరుపున భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. ఈ వేడుకలలో జనగామ గ్రామ పంచాయతీతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కళ్యాణ మహోత్సవాన్ని వీక్షించారు. ఈ వేడుకలలో సర్పంచ్ మారిశెట్టి పద్మ, సూపక సర్పంచ్ కశెట్టి సతీష్, మాజీ ఎంపిటీసి తిరుపతి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టరేట్‌లో ఘనంగా
## దొడ్డి కొమురయ్య జయంతి

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

శుక్రవారం కలెక్టరేట్లోని సమావేశం మందిరంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆర్డీవో రత్న కళ్యాణి పాల్గొన్నారు. ముందుగా దొడ్డి కొమరయ్య చిత్రపటానికి అధికారులు, పలువురు కుల సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అధికారులు నాయకులు మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య గొప్పతనాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి శ్రీనివాస్, జిల్లా కురుమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# 'బాసర' అభివృద్ధికి ప్రభుత్వ కట్టుబడి ఉంది





- సీఎం పర్యటనకు ముమ్మర ఏర్పాట్లు!
- 6న సీఎం రేవంత్ రెడ్డి పర్యటన
- బాసరలో ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి
- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో సమీక్ష
- భక్తుల సౌకర్యార్థం భారీగా నిధుల కేటాయింపు
- అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి శంకుస్థాపన
- సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలని అధికారులకు ఆదేశం

**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈనెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటన సందర్భంగా, ఆయన, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రాష్ట్ర ఉర్దూ ఆకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్‌లతో కలిసి బాసరలో ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా బాసరకు చేరుకున్న ప్రభుత్వ సలహాదారు, తదితరులకు కలెక్టర్ అభిలాష అభినవ్ పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముఖ్యమంత్రి ఆలయంలో పూజలు నిర్వహించే ప్రాంతం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే ప్రాంతాలు పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఆలయ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని అన్నారు. బాసరతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలు అన్ని అభివృద్ధిపరిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల అరవ తేదీన ముఖ్యమంత్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని చెప్పారు. దేశం నలుమూలల నుంచి బాసరకు ఎంతో మంది భక్తులు వస్తారని, ఆ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, దర్శనాలు సౌకర్యవంతంగా పూర్తయ్యేలా తగిన సౌకర్యాలు కల్పిస్తామని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లూరు ఆశ్రమ పాఠశాలలో 'ఫుడ్ పాయిజన్'



- ఆరుగురు విద్యార్థులు, ఉపాధ్యాయుడికి అస్వస్థత
- రాత్రి మిగిలిన సాంబార్‌తిని అస్వస్థతకు గురైన విద్యార్థులు, బయో సైన్స్ టీచర్
- పెంచికలపేట పీహెచ్‌సీలో డాక్టర్లు లేకపోవడంతో హుటాహుటిన కాగజ్‌నగర్‌కు తరలింపు..
- చికిత్స పొందుతున్న 9, 10వ తరగతి విద్యార్థులు
- ఆందోళనలో విద్యార్థుల తల్లిదండ్రులు..



**బెజ్జూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికలపేట మండలం ఎల్లూరు ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఫుడ్ పాయిజన్ అయింది. ఎల్లూరు అశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న బయో సైన్స్ ఉపాధ్యాయుడు హట్కరి బాలాజీతో పాటు, ఆరుగురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఉపాధ్యాయుడు బాలాజీ, పదవ తరగతి విద్యార్థులు శశికిరణ్, నవదీప్, సమ్మయ్య, అంజన్న, 9వ తరగతి చదువుతున్న సురేష్, కలిసి గురువారం రాత్రి మిగిలిన సాంబార్‌ను తిన్నారు. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయుడు అస్వస్థకు గురయ్యారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులు గమనించి పెంచికలపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి శుక్రవారం ఉదయం తరలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు లేకపోవడంతో, కాగజ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి చికిత్స అందిస్తున్నారు.




## గంజాయితో భవిష్యత్తు నాశనం

**కుభీర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

యువత భవిష్యత్తు నాశనం చేస్తూ, సమాజానికి ప్రమాదకరంగా మారిన గంజాయిని ఉక్కుపాదంతో అణచి వేసేందుకు కృషి చేస్తున్నామని కుభీర్ ఎస్సై శ్రీనివాస్ వెల్లడించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ మండల కేంద్రంలో 'గంజాయిగస్తీ' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏకకాలంలో కుభీర్‌లోని అన్ని పాన్ షాపులు, పలు దుకాణాలను సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. యువతకు గంజాయి సేవనంతో కలిగే అనర్థాల గురించి వివరించారు. గంజాయి సమాచారం ఎవరికైనా తెలిసినా పోలీసులకు సమాచారం అందించాలని, తెలిపిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతా మన్నారు. గంజాయి బానిసలను రిహాబిలిటేషన్ కేంద్రాల్లో చికిత్స అందించి కౌన్సిలింగ్ ద్వారా మార్పు తీసుకువచ్చేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. ఎవరైనా గంజాయి సాగు, సరఫరా చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పద్ధతి మార్చుకోని పీడీయాక్టు కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

## దేవరకొండ బ్రహ్మోత్సవాలు

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ప్రాచీన శ్రీ దేవరకోట వెంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శుక్రవారం వెంకటేశ్వర స్వామిని ఊరేగింపు నిర్వహించగా ఈ వేడుకల్లో నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి పాల్గొని పూజలు నిర్వహించారు. మాడ వీధుల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవరకోట చైర్మన్ ఆమేడ శ్రీనివాస్ కౌన్సిలర్ శ్రీకాంత్ యాదవకమిటీ సభ్యులు శ్రీధర్ కృష్ణవేణినాయకులు పాల్గొన్నారు.



## గంజాయి తాగడం నేరం


### ఖానాపూర్ ఎస్సై రాహుల్ గైక్వాయిడ్

**ఖానాపూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండల కేంద్రంలో పోలీసులు గాంజా గస్తీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని పలు పాన్ షాప్లు, కిరాణా షాపులు తనిఖీ చేసి మత్తు పదార్థాలు అమ్మ రాదని యజమానులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఎస్సై రాహుల్ గైక్వాయిడ్ మాట్లాడుతూ గంజాయి అమ్మకం సమాచారాన్ని తమకు అందించాలని వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. గంజాయి సేవించడం వల్ల వచ్చే దుష్పరిమానాలను పలువురికి వివరించారు .కార్యక్రమంలో స్థానిక పోలీస్ బృందం, ఆటో డ్రైవర్లు, యజమానులు ఉన్నారు.




# హరితహారం చెట్లకు నిప్పు



**భీమిని, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

గ్రామాలు పచ్చదనంతో కలకలాడాలనే సదుద్దేశంతో ప్రభుత్వం నర్సరీలలో లక్షలు ఖర్చు చేసి మొక్కలు పెంచి ఏటా వర్షాకాలంలో రోడ్ల వెంట మొక్కలు నాటుతున్నారు. వాటికి నీరు పోసి పెంచుతుండగా కొందరు వాటికి నిప్పు పెట్టడం, మరి కొందరు వాటిని వాటిని నరుకుతున్నారు. చెట్లు ఏపుగా పెరిగి పచ్చదనాన్ని సంచరించుకుని బాటసారులకు కనువిందు చేస్తున్నాయనుకునే సమయంలో వాటి ఆలనా పాలన చూసేవారు లేకపోవడంతో నీరు అందక ఎండిపోతున్నాయి. భీమిని మండలంలోని రాంపూర్ – బిట్టూర్ పల్లి గ్రామాల మధ్యలో ఉన్న రోడ్డు వెంట కొన్ని చెట్లు కాలిపోయి మోడుగా మారాయి. మరో వైపు ఎదిగిన కొన్ని చెట్లు వరుసగా కాలిపోయి దర్శనం ఇస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో నీళ్ల అందక మొక్కలు ఎండిపో తుంటే, దీనికి తోడు మంటలు అంటూకోవడంతో పచ్చదనం కరువైతుంది. సంబంధిత శాఖ అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో ఇలా జరుగుతుందని, హరితహారంలో భాగంగా నాటిన చెట్లను కాపాడే బాధ్యతను పంచాయతీ అధికారులు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# క్యాతన్‌పల్లి మున్సిపల్ పీఠంపై పోరు

- 'గులాబీ' కోటలో 'హస్తం' పాగా వేస్తుందా?
- మ్యాజిక్ ఫిగర్ కోసం పార్టీల పాట్లు..
  ఎక్స్ అఫీషియో ఓట్లపై కాంగ్రెస్ ఆశలు.
- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య సాగనున్న ఎన్నికల ప్రక్రియ
- సందిగ్ధానికి తెరపడే సమయం ఆసన్నం..
- మరికొద్ది గంటల్లో తేలనున్న చైర్మన్ ఎవరో!
- భారీ పోలీసు బందోబస్తు ఏర్పాట్లు
- క్యాంపు నుంచి రానున్న బీఆర్ఎస్, సీపీఐ కౌన్సిలర్లు

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మునిసిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు సమయం ఆసన్నమైంది. మరికొద్ది గంటల్లో కుర్చీ ఎవరిదనే సందిగ్ధానికి తెరపడనుంది. వాస్తవానికి ఫబ్రివరి 13న మునిసి పల్ ఎన్నికల ఫలితాలు వెలువడగా, 16వ తేదీన చైర్మన్, వైస్ చైర్మన్ ఎ న్నిక నిర్వహించాల్సి ఉంది. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య నెలకొన్న పోరు సందర్భంగా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులు పలువురు హై కోర్టును ఆశ్రయించడంతో ఎన్నికలు అనివార్యం అయ్యాయి. రాష్ట్రంలో వాయిదాపడ్డ క్యాతన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, ఖానాపూర్ మునిసిపల్ ఎన్నికలను మూడు వారాల్లోగా నిర్వహించాలని హై కోర్టు గత నెల 6వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. గడువు సమీపిస్తుండటంతో ఈ నెల 4వ తేదీన ఎన్నికలు నిర్వహించేందుకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో నేడు నిర్వహించే చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

**క్యాంపు నుంచి నేరుగా కార్యాలయానికి...**

చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక అనూహ్యంగా వాయిదా పడటంతో అప్రమత్తమైన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ బీఆర్ఎస్‌తోపాటు మిత్రపక్ష మైన సీపీఐ సభ్యులు 14 మందిని క్యాంపునకు తరలించారు. అప్పటి నుంచి వారంతా క్యాంపులోనే ఉండగా, శనివారం నేరుగా మునిసిపల్ కార్యాలయంలో జరుగున్న ఎన్నికకు తిరిగి రానున్నారు. అయితే ఈసారైనా చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుందా అన్న సందేహాలు ప్రజల్లో నెల కొన్నాయి. ఇప్పటికే అధికారులు ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయగా, గత అనుభవాన్ని దృష్టిలో ఉంచుకున్న పోలీస్‌శాఖ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా మునిసిపల్ కార్యాలయ పరి సర ప్రాంతాల్లో బీఎన్ఎస్ సెక్షన్ 163 అమలు చేస్తోంది. ఇందులో భా గంగా మునిసిపల్ కార్యాలయం ఆవరణతోపాటు, పరిసర ప్రాంతాల వద్ద పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాట్లు చేశారు. దాదాపు 800 సిబ్బందిని ఎన్నికల కోసం నియమించారు.

**బీఆర్ఎస్‌కే అవకాశాలు...**

మునిసిపల్ ఎన్నికల ఫలితాల్లో మిత్రపక్షమైన సీపీఐతో కలిసి పాలక వర్గాన్ని ఏర్పాటు చేసే అవకాశాలు బీఆర్ఎస్‌కే అధికంగా ఉన్నాయి. మొత్తం 22 వార్డులకుగాను బీఆర్ఎస్, సీపీఐ కూటమికి కలిపి మొత్తం 14 సీట్లు లభించాయి. అలాగే అధికార కాంగ్రెస్‌కు ఏడు సీట్లురాగా, స్వతంత్ర అభ్యర్థి పార్టీలో చేరడంతో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య ఎనిమిదికి చేరింది. నియోజకవర్గ ఎమ్మెల్యేగా గడ్డం వివేకానంద, ఆయన కుమారుడు పె ద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ఎక్స్ అఫీషియో హోదాలో ఓటు హక్కు వినియో గించుకోనున్నారు. వారిద్దరితో కాంగ్రెస్ సంఖ్య 10కి చేరుతుంది. అయినా మ్యాజిక్ ఫిగర్ దాటకపోవడంతో ఆ పార్టీ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకొనే అవకాశాలు దాదాపుగా లేవు. ఒకవేళ ఊహించని విధంగా సీపీఐ సభ్యులు నలుగురు హస్తం పార్టీకి మద్దతు తెలిపితే తప్ప చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కాంగ్రెస్ ఖాతాలో పడే అవకాలు లేవని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.. ఏం జరుగుతుందో చూడాలి.



# ఆరోగ్యశ్రీలో అరుదైన వైద్యం

## ఐరిస్క్ ఆపరేషన్ చేసిన వైద్యులు

## తల్లీబిడ్డలు క్షేమం

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని దేవేందర్ రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పేద కుటుంబానికి ఉచితంగా ఆరోగ్య శ్రీలో అరుదైన వైద్యం అందించినట్లు డాక్టర్ దేవేందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం వివరాలు వెల్లడించారు. కుంటాల మండలం అందాపూర్ గ్రామానికి చెందిన కల అనే మహిళ ఏడు నెలల గర్భవతితో ఆసుపత్రికి వచ్చినట్లు తెలిపారు. ఆమెకు తీవ్ర రక్తస్రావం కావడంతో అపస్మానస్థితికి చేరుకుంది. కుటుంబ ఆర్థిక పరిస్థితుల కారణంగా కుటుంబ సభ్యుల ఒత్తిడి మేరకు ఆరోగ్యశ్రీలో చేర్చుకొని వైద్యం అందించడం జరిగింది. జనరల్ సర్జన్ దేవేందర్ రెడ్డి స్త్రీ శైలజ. అశ్విన్ సతీష్ మరో ఇద్దరు వైద్యుల సహకారంతో ఐరిస్క్ ఆపరేషన్ చేసినట్టు తెలిపారు. 700 గ్రాముల బాబు జన్మించడంతో పిల్లల వైద్యుల నిపుణుల పర్యవేక్షణలో బాబును కాపాడినట్లు తెలిపారు. తల్లి బిడ్డలకు 29 రోజులు ఆస్పత్రిలో ఆరోగ్య సేవలు అందించడంతో వారిద్దరూ ఆరోగ్యంగా ఉన్నారని వారిని శుక్రవారం డిశ్చార్జ్ చేసినట్టు తెలిపారు. ఈ వైద్య సేవలకు ప్రవేట్‌లో పది లక్షల వరకు అయ్యేదని తమ దేవేందర్ రెడ్డి హాస్పిటల్ లో ఉచితంగా అందించామని పేర్కొన్నారు. వైద్యం అందించిన డాక్టర్ దేవేందర్ రెడ్డి వైద్య బృందానికి కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# గ్రామీణ క్రీడలకు వేదికగా జేపీఎల్



**వాంకిడి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

వాంకిడి మండలం జంబుల్ దారి గ్రామపంచాయతీ పరిధిలోని లంజనివీర గ్రామంలో జంబుల్ దారి ప్రీమియర్ లీగ్ (జేపీఎల్) క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ఘనంగా ప్రారంభ మైంది. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నులే నారాయ ణ, జంబుల్ దారి ఉప సర్పంచ్ గుర్నులే విట్టల్ టాస్ వేసి పోటీలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గుర్నులే నారాయణ మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిం చడం ఎంతో అవసరమని, తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్లు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారి ప్రతిభను వెలికితీయడా నికి వేదికగా నిలుస్తాయని అన్నారు. ఉప సర్పంచ్ గుర్ను లే విట్టల్ మాట్లాడుతూ... గ్రామ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలు యువతను మంచి మార్గంలో నడిపిస్తాయని, చెడు అలవాట్లకు దూరంగా ఉంచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. క్రీడలతో పాటు విద్యలోనూ రాణించాలని యువతకు సూచించారు. టోర్నమెంట్‌లో వివిధ జట్లు పాల్గొనగా, ప్రారంభ మ్యాచ్‌లు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమంలో నిర్వాహకులు, గ్రామ పెద్దలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# ధర్మ పరిరక్షణ కోసం పాటుపడాలి

**కుభీర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ధర్మాన్ని మనం రక్షిస్తే అది మానవ సమాజాన్ని రక్షిస్తుందని అటువంటి ధర్మ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సరస్వతి ఆనంద్ మహారాజ్ అన్నారు. శుక్రవారం బాసరలో వీరశైవ లింగాయత్ ఆధ్వర్యంలో ధర్మ పరిరక్షణ కోసం సభ్యులు ముందుకు నడవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు శంకర్, ఉపాధ్యక్షులు సాయినాథ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగాధర, పండరి, కామన తదితరులు పాల్గొన్నారు.

# నిర్మల్ కలెక్టరేట్ దారిలో 'ఏడున్నర' అడుగుల పాము

## స్నేక్ క్యాచర్ చేతికి చుట్టుకుని హల్‌చల్



**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం):**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ వెళ్లే ప్రధాన రహదారిపై శుక్రవారం భారీ సర్పం ప్రత్యక్షమై కలకలం సృష్టించింది. సుమారు ఏడున్నర అడుగుల పొడవున్న పాము రోడ్డుపై కదలకుండా పడుకోవడంతో అటుగా వెళ్లే పాదచారులు, వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. స్థానికులు వెంటనే స్నేక్ క్యాచర్ యాస్మిన్‌కు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న యాస్మిన్ పామును పట్టుకునేందుకు ప్రయత్నించగా, అది ఒక్కసారిగా అతని చేతిని గట్టిగా చుట్టుముట్టింది. ఈ అనూహ్య పరిణామంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. అయితే యాస్మిన్ ఏమాత్రం తడబడకుండా, అత్యంత చాకచక్యంతో పాము పట్టు నుంచి తన చేతిని వదిలించుకుని, దానిని సురక్షితంగా బంధించారు. అనంతరం ఆ భారీ సర్పాన్ని సమీపంలోని అడవి ప్రాంతంలో విడిచిపెట్టడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

# పట్టణంలో విస్తృత తనిఖీలు



**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలో పట్టణ సీఐ సమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. గంజాయి గస్తీ కార్యక్రమంలో వివిధ వ్యాపార దుకాణాలను తనిఖీ చేశారు. ప్రజలకు గంజాయి నివారణపై అవగాహన కల్పించారు. గంజాయి విక్రయించిన తాగిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# ఏఎస్పీని పరామర్శించిన అల్లోల

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ ఏఎస్పీ ఉపేందర్ రెడ్డి తండ్రి వెంకటరెడ్డి ఇటీవల మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఉపేందర్ రెడ్డి ఇంటికి వెళ్లి జరిగిన సంఘటన పట్ల విచారం వ్యక్తం చేశారు. అనంతరం సీనియర్ పాత్రికేయుడు పత్తి శివప్రసాద్ మాతృమూర్తి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో మురళీధర్ రెడ్డి మాజీ జెడ్పిటిసి పత్తిరెడ్డి రాజశేఖర్ రెడ్డి దేవరకోట మాజీ చైర్మన్ ఆమేడ శ్రీధర్ తదితరులు ఉన్నారు.



# విద్యార్థుల భోజనంలో 'మెనూ' తప్పనిసరి

- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె. హరిత
- రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను
  ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్...
- వసతి గృహంలో స్టోర్ రూమ్, మరుగుదొడ్లు,
  భోజన సౌకర్యాల పరిశీలన
- పదిలో వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి
  చేయాలని ఉపాధ్యాయులకు ఆదేశం



**జైనూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

విద్యార్థులకు వడ్డించే భోజనంలో మెనూ తప్పక పాటించాలని కలెక్టర్ హరిత అన్నారు. మండలంలోని రాసిమెట్ట బాలికల ఆశ్రమోన్నత పాఠశాలను కలెక్టర్ కె హరిత శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని స్టోర్ గది, మరుగుదొడ్లు, భోజన సదుపాయాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ హరిత విద్యార్థులతో మాట్లాడారు. మెనూ ప్రకారం భోజన సదుపాయం కల్పిస్తున్నారా, ఉపాధ్యాయులు సమయానుకూలంగా పాఠశాలకు వస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతు పదో పరీక్షలో విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించేలా కృషి చేయాలన్నారు. ఆశ్రమోన్నత పాఠశాల విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలన్నారు. కలెక్టర్ తనిఖీ సందర్భంగా పాఠశాల హెచ్ఎం లేక పోవడంతో ఎక్కడికి వెళ్లారని ఆరా తీశారు. ఆమె కుమారుడి ఆరోగ్యం బాగా లేనందున ఆసుపత్రికి వెళ్లారని ఉపాధ్యాయులు సమాధానం ఇచ్చారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలన్నారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

# బాసరను విశ్వవ్యాప్తం చేసేలా ప్రణాళికలు

- రూ.300 కోట్లతో ఆలయ పునరుద్ధరణ పనులు
- కుంభమేళా స్థాయిలో గోదావరి పుష్కరాలు..
- ఏప్రిల్ 6న సీఎం చేతుల మీదుగా శంకుస్థాపనలు
- రూ.300 కోట్ల నిధులతో పర్యాటక రంగం అభివృద్ధి
- బాసరలో పనుల ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు జూపల్లి, వివేక్, కలెక్టర్ అభిలాష అభినవ్





**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 6వ తేదీన బాసర పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముందుగా బాసర చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో పాటు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు మంత్రులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబోయే ప్రాంతాల వివరాలను మంత్రులకు వివరించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్న ప్రదేశాలను మంత్రులు పరిశీలించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం రాజన్న అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాసర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.300 కోట్లతో దేవాలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్ర రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, ఆలయ ఈవో విజయరామారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.







## లయన్స్‌క్లబ్ సేవలు ఆదర్శనీయం

**చెన్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
లయన్స్‌క్లబ్ సేవలు ఆదర్శనీయమని చెన్నూరు సీఐ బన్సీలాల్ పేర్కొన్నారు. శుక్రవారం కరీంనగర్‌కు చెందిన డాక్టర్ భాస్కర్ మడేకర్ ఉదార నేత్రవైద్యశాల సౌజన్యంతో వైస్ చైర్మన్ లయన్ సురేష్ సహకారంతో చెన్నూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని సీఐ ప్రారంభించి మాట్లాడారు. లయన్స్‌క్లబ్ ద్వారా అనేక సమాజహిత కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు, నిరుపేదలకు సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు. ఈ శిబిరంలో 73 మందికి వైద్యులు నేత్ర పరీక్షలతో పాటు బీపీ, షుగర్ పరీక్షలను నిర్వహించారు. కంటి చూపుతో బాధపడుతున్న 40 మందిని గుర్తించి ఆపరేషన్ కోసం రేకుర్తి కంటి ఆసుపత్రికి తరలించినట్లు లయన్స్‌క్లబ్ ప్రెసిడెంట్ జాడి తిరుపతి తెలిపారు. ఆపరేషన్‌లు చేయించుకునే వారికి ఉచిత బస్సు, భోజనం సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోన్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్, కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారిగా సాగర్, సభ్యులు మహేందర్, సతీష్‌గౌడ్, దుర్గా ప్రసాద్,ప్రకాష్‌బాబు, నాగరాజుగౌడ్, సత్యనారాయణ, నవీన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# కరుణామయుని సేవలో క్రైస్తవులు



**బెల్లంపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
గుడ్‌ఫ్రైడే సందర్భంగా శుక్రవారం చర్చ్‌లలో క్రైస్తవులు ప్రార్థనలు జరిపారు. ఏసుక్రీస్తు చెప్పిన ఏడు వాక్యాలను గుర్తుకు తెచ్చుకుని ఆధ్యాత్మిక భావంతో పులకరించి పోయారు. బైబిల్ పఠనాలు, ప్రార్థనలతో పాటు క్వాయర్స్ బృందం గీతాలు ఆలపించి జీసస్ పట్ల భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ఉపవాస దీక్షలను విరమించి దాన ధర్మాలు చేశారు. బహుమతులను పంచారు. బెల్లంపల్లి పట్టణంలో పాస్టర్ సందేశం ఇచ్చారు.

# విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దు

- క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికలకు 'ఖాకీ' నిఘా
- 485 మందితో భారీ బందోబస్తు
- విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు
- క్యాతనపల్లిలో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ హెచ్చరిక..



**రామకృష్ణాపూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
క్యాతనపల్లి మున్సిపాలిటిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సందర్భంగా పోలీసులకు కేటాయించిన డ్యూటీలు సక్రమంగా నిర్వర్తించాలని, కేటాయించిన డ్యూటీ ప్రదేశాన్ని వదిలి వెళ్లకూడదని బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ ఆవరణలో క్యాతనపల్లి మున్సిపాలిటి చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక సజావుగా నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిక ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు తగిన భద్రతా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, పోలీసులకు సహకరించాలని కోరారు. ఎన్నిక సందర్భంగా శాంతి భద్రతలను కాపాడేందుకు బందోబస్తుకు నలుగురు ఏసీపీలు, 23 మంది సీఐ, ఎస్ఐలు 46 మంది, ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ లు 98 మంది, పోలీస్ కానిస్టేబుళ్లు 167 మంది, మహిళా పోలీస్ సిబ్బంది 49 మంది, స్పెషల్ పార్టీ సిబ్బంది 38 మంది, హోం గార్డులు60 మంది, మొత్తం 485 మంది పోలీసులతో పాటు నాలుగు టిజీ ఎస్‌పి ప్లాటున్‌లు విధుల్లో పాల్గొంటున్నాయని తెలిపారు.



## బెల్లంపల్లి బార్ ఎన్నికల్లో దాసరపు రాజు ఏకగ్రీవ విజయం

**బెల్లంపల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో 2026-27 సంవత్సరానికి గాను జరిగిన బార్ ఎన్నికల్లో శ్రీ దాసరపు రాజు అడ్వకేట్ జాయింట్ సెక్రటరీ పదవికి ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి సివిల్ జడ్జి ముకేశ్, ఎన్నికల అధికారులు గోలి శ్రీనివాస్, తౌటం సౌమ్యలు ఆయనను సన్మానించారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న బార్ సభ్యులకు శ్రీ దాసరపు రాజు కృతజ్ఞతలు తెలిపారు.

## కాలినడకన వచ్చి.. మొక్కులు తీర్చుకొని

**ఉట్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
ఆదివాసి గోండుల ఆరాధ్య దేవత ఇంద్రాయి దేవతకు మొక్కులు తీర్చుకునేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాతో పాటు పక్క రాష్ట్రమైన మహారాష్ట్రకు చెందిన గోండు గిరిజనులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. శుక్ర వారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లాలోని ఆయా మండలాల పరిధిలోని గ్రామాల గిరిజనులు, మహిళలు మండుటెండను సైతం లెక్కచేయకుండా నడుచుకుంటూ ఆలయానికి చేరుకున్నారు. ఆలయ పరిసర ప్రాంతంతో పాటు మార్కెట్ యార్డ్ భక్తులతో కిటకిటలాడింది. ఇంద్రాయి దేవతకు మొక్కు లు తీర్చుకునేందుకు దంపుడు బియ్యం నైవేద్యంతో పాటు, ఇప్ప పరక నూనెతో మినప పప్పు గారెలను తయారు చేసి నైవేద్యంగా సమర్పించారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్, యావత్ మాల్, కిన్వాట్ ప్రాంతాల నుంచి గిరిజనులు తరలి వచ్చి దేవత మొక్కులు తీర్చుకున్నారు. వేలాదిగా భక్తులు తరలి రావడంతో ఇంద్రాయి దేవత ఆలయం జనసంద్రమైంది.




# ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు



**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అమరవీరుడు దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల శంకర్ ముఖ్య అతిథులుగా హాజరై, దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఆయన త్యాగం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని, బహుజన ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహనీయుల జీవిత చరిత్రలను జయంతి, వర్ధంతి కార్యక్రమాల ద్వారా స్మరించుకోవడం తో పాటు నేటి తరానికి తెలియజేసే అవకాశం లభిస్తుందన్నారు. బిసి సంక్షేమం, అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనేక నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. దొడ్డి కొమరయ్య విగ్రహ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బీసీ సంఘాల నాయకులు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేలు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా బిసి అభివృద్ధి అధికారి సోనియా, పట్టణ తహసిల్దార్ సంపత్ శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీనివాస్, వివిధ బిసి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద గూటికి 'కలెక్టర్' వెలుగు







- ఊయికె సుభద్ర ఇంటికి రాజర్షి షా సందర్శన
- ప్రత్యేక చొరవతో మంజూరు చేయించిన కలెక్టర్
- గృహప్రవేశ వేడుకలో పాల్గొన్న రాజర్షి షా
- సుభద్రను శాలువాతో సన్మానించి, బహుమతి అందజేత
- జాతర్ల రామ్‌నగర్ హాబిటేషన్‌లో పండుగ వాతావరణం

**బజార్‌హత్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం):** ప్రభుత్వ అధికారి అంటే కేవలం ఆదేశాలు ఇచ్చేవారు మాత్రమే కాదు, నిరుపేదల కన్నీళ్లు తుడిచే ఆత్మీయుడు కూడా అని ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా మరోసారి నిరూపించారు. బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామం రామ్‌నగర్ హాబిటేషన్‌కు చెందిన ఊయికె సుభద్ర అనే నిరుపేద మహిళ సొంతింటి కలను కలెక్టర్ తన ప్రత్యేక చొరవతో సాకారం చేశారు. గతంలో ఆమె పరిస్థితిని గమనించి, గృహ నిర్మాణానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించిన కలెక్టర్, శుక్రవారం నూతనంగా నిర్మించుకున్న ఆ ఇంటిని స్వయంగా సందర్శించారు. తమ గ్రామానికి స్వయంగా కలెక్టర్ రావడంతో రామ్‌నగర్ వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. సుభద్ర ఇంటిని పరిశీలించిన కలెక్టర్.. ఆమెను సాదరంగా శాలువాతో సన్మానించి, నూతన గృహప్రవేశం సందర్భంగా ప్రత్యేక బహుమతిని అందజేశారు. ఒక సామాన్య మహిళ సొంతింటి కల నెరవేరిన తరుణంలో జిల్లా అత్యున్నత అధికారి స్వయంగా వచ్చి అభినందించడం అక్కడి వారిని ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సుభద్ర ఆనంద బాష్పాలతో కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ శ్యామ్ సుందర్, హౌసింగ్ ఏఈ జలబ, ఇతర అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మన ఇసుక - వాహనం' పోర్టల్ ద్వారానే ఇసుక విక్రయాలు

### ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా - హెల్ప్ డెస్క్ నెంబర్ 7569538588




**ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)** మన ఇసుక-వాహనం పోర్టల్ ద్వారానే ఇసుక విక్రయాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇసుక పంపిణీ వ్యవస్థను మరింత పారదర్శకం చేసేందుకు జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. గతంలో అమలులో ఉన్న మాన్యువల్ కూపన్ల విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తూ, ఇకపై 'మన ఇసుక - వాహనం' పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్ పద్ధతిలో ఇసుక విక్రయాలు జరపాలని కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. సాధారణ ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ పనుల కోసం ప్రతి ట్రాక్టర్ ఇసుక ధరను రూ.400 గా కమిటీ నిర్ణయించడం జరిగిందని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో, వారికి అవసరమైన ఇసుకను రూ.15/- (నామమాత్రపు ధర) రాయితీ ధరకే అందించడం జరుగుతుందన్నారు. జిల్లాలోని నిర్దేశిత క్వారీలు, చెరువుల నుండి ఇసుకను పొందేందుకు ఏప్రిల్ 1, 2026 నుండే ఈ ధరలను అమలు పరచడం జరిగిందని తెలిపారు. వినియోగదారులు తమకు కావలసిన ఇసుకను tgmiv.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా లేదా ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉన్న MIV Mobile App ద్వారా సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మాన్యువల్ కూపన్లు చెల్లవని, కేవలం ఆన్‌లైన్ రశీదులు ఉన్న వాహనాలనే ఇసుక తరలింపునకు అనుమతిస్తామని ఆయన స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్ నెంబర్ 7569538588 సంప్రదించాలని, ఈ పారదర్శక విధానాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ ప్రకటనలో కోరారు.



### తెలంగాణ సాయుధ పోరాట

# వీరుడు దొడ్డి కొమురయ్య

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య

### కలెక్టరేట్‌లో ఘనంగా జయంతి వేడుకలు

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య జయంతి ఉత్సవాలకు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, వివిధ కుల సంఘాల ప్రతినిధులు, వెనుకబడిన తరగతుల కులాల సంఘాల ప్రతినిధులతో కలిసి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం విరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు, యాదవ, కురుమ కుల సంఘాల ప్రతినిధులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




# ఇంటర్ లింక్ లైక్ ఏర్పాటు

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)** నిర్మల్ పట్టణంలో విద్యుత్ సరఫరా అంతరాయం లేకుండా నాలుగు సబ్ స్టేషన్ లింక్ లైన్ పనులు చేపట్టినట్టు పట్టణ ఏడి కే శ్రీనివాసరావు తెలిపారు. శనివారం పట్టణంలోని ఆదర్శనగర్, 33/11 కివి మరమ్మతులతో పాటు లింక్ లైన్ పనులను చేపడుతున్నట్టు తెలిపారు. ఈ పనులు పూర్తయితే పట్టణంలో కరెంట్ సరఫరాలో అంతరం లేకుండా ఉంటుందన్నారు. ఈ పనుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

# మున్సిపల్ చైర్ పర్సన్, వైస్‌చైర్‌పర్సన్ పరీక్ష ఎన్నికకు పూర్తి ఏర్పాట్లు

### మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య



**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)** మున్సిపల్ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 4వ తేదీన జిల్లాలోని క్యాతనపల్లి మున్సిపాలిటీలో చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్‌ల పరోక్ష ఎన్నికలు నిర్వహించనున్న నేపథ్యంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి సబ్ కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు మనోజ్ తో కలిసి క్యాతనపల్లి మున్సిపాలిటీ కార్యాలయాన్ని సందర్శించి బి-ఫామ్ జారీకి సంబంధించి ఫామ్-ఎ (అధికార ప్రతినిధి అధికరణ పత్రాలు)ను స్వీకరించారు. ఎన్నికల హాల్‌ను పరిశీలించి, బారికేడింగ్, భద్రతా ఏర్పాట్లు, సదుపాయాలను తనిఖీ చేసి ఎ.సి.పి, ఎస్.ఐ.లతో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండేందుకు ప్రత్యక్ష ప్రసారం ఏర్పాట్లు చేయాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా జరిగేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేసి అన్ని చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఒకేసారి మూడు నెలల రేషన్

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)** జిల్లాలో ఒకేసారి మూడు నెలల రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ కార్యక్రమం బుధవారం నుంచి ప్రారంభమైంది. మూడు ప్రతీ నెలా 1 నుంచి 15వ తేది వరకు బియ్యం పంపిణీ చేసేవారు. కానీ ఈ సారి ఏప్రిల్ నెలాఖరు వరకు చౌకధరల దుకాణాల్లో సన్న బియ్యం పంపిణీ చేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టారు. అందుకు సంబంధించిన ఆదేశాలు జారీ అయినట్లు తెలుస్తోంది. జిల్లాలో అన్ని రకాల రేషన్ కార్డులు 1,64,490 ఉండగా, 5,41,444 మంది లబ్ధిదారులు ఉన్నారు. నెల వారీ కోటా బియ్యం కోటా సరఫరా చేసేందుకు పది నుంచి పన్నెండు రోజుల సమయం పడుతుంది. అదే మూడు నెలల బియ్యం కోటా పంపిణీ చేసేందుకు మరింత సమయం తీసుకునే అవకాశం ఉన్నది. జిల్లాలోని రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఒకేసారి రేషన్ బియ్యాన్ని పంపిణీ చేసేందుకు కావాల్సిన బియ్యాన్ని ఎంఎల్ఎస్ పాయింట్ల ద్వారా ఇప్పటికే రేషన్ దుకాణాలకు చేరవేసే ప్రక్రియ ప్రారంభం అయ్యింది. ప్రజా పంపిణీ వ్యవస్థ నిబంధనల ప్రకారం ఆహార భద్రతా కార్డులోని ప్రతీ లబ్ధిదారు(యూనిట్) కు నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. తాజాగా మూడు నెలల కోటా ఒకేసారి పంపిణీ చేస్తున్న క్రమంలో ఒక్కో లబ్ధిదారుకు 18 కిలోల బియ్యం అందనుంది. అంత్యోదయ కార్డుదారులకు నెలకు 35 కిలోల వంతున మూడు నెలలకు కలిపి 105 కిలోల బియ్యం అందజేస్తారు.

**ఒకే సారి వేలిముద్ర వేసేలా..**

లబ్ధిదారుడి వేలిముద్ర ఒకే సారి వేసేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేశారు. ఒక లబ్ధిదారుడు ఏప్రిల్, మే, జూన్ నెలల రేషన్ కోటా బియ్యం తీసుకోవాలంటే మూడు సార్లు బయోమెట్రిక్ తీసుకోవాల్సి ఉంటుంది. వరుసగా రెండు, మూడు సార్లు వేలిముద్రలు నమోదు చేసుకునే అవకాశం ఈ పాస్ (పీఓఎస్)లో లేదు. ఒకే సారి మూడు నెలల బియ్యం కోటా తీసుకునేందుకు వీలుగా ఈ పాస్‌లో సాంకేతిక మార్పులు, చేర్పులు చేయనున్నారు. వేలి ముద్రలు మూడు సార్లు విడివిడిగా వేయకుండా ఒకే సారి వేసేలా సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేశారు.

# ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్‌కు 'పూర్వ వైభవం'



- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్
- ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారం
- భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు పదవుల్లో ప్రాధాన్యం
- త్వరలోనే ఆదిలాబాద్‌కు విమానాశ్రయం
- అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి
- బీఆర్ఎస్ అప్పులపాలు చేస్తే.. ఆర్థిక ఇబ్బందుల్లోనూ సంక్షేమం అందిస్తున్నాం
- ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ఆధ్వర్యంలో పార్టీ బలోపేతానికి దిశానిర్దేశం..

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ పుర్వవైభవం దిశగా వెళుతుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ పంక్షన్‌హాల్‌లో శుక్రవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు సుగుణ అధ్యక్షతన జరిగిన పార్టీ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, పీసీసీ కార్యదర్శులు రాజేశ్వర్, అనిల్‌కుమార్‌లతో కలిసి హజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం కంచుకోటగా ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంతంలో మళ్లీ పూర్వ వైభవం దిశగా వెళుతుందన్నారు. నూతనంగా జిల్లా కార్యవర్గంలో అవకాశం లభించిన ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి తమ వంతుగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రాహుల్‌గాంధీ పాదయాత్ర సామాజిక స్పృహ, ప్రజా సంక్షేమం దిశగా కొనసాగిందని చెప్పారు. అయన ఇచ్చిన స్పూర్తితో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గ్రామాలు దేశానికి గుండెలాంటివని గాంధీజీ చెప్పారని గుర్తు చేశారు. అయనను అనుసరించి కాంగ్రెస్ పార్టీ ముందుకు సాగుతుందని వివరించారు. జిల్లా, రాష్ట్ర కమిటీల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 70 శాతం కేటాయించామన్నారు. పదవుల కేటాయింపులను కూడా క్షేత్ర స్థాయిలో పరిశీలించి ప్రకటించామని చెప్పారు. పార్టీకి కార్యకర్తలు ముఖ్యమన్నారు. కష్టపడ్డ వారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. రాష్ట్రం ఏర్పడినపుడు 68వేల కోట్ల అప్పు ఉంటే 10 ఏళ్ల కాలంలో కేసీఆర్ 8లక్షల కోట్లు అప్పు చేశారని అన్నారు. అయన చేసిన అప్పులకు రూ. 6,500 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలను రాష్ట్రంలో కొనసాగిస్తున్నామని అన్నారు. బీజేపీ అధికారంలో ఉన్నప్పటికీ ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని అన్నారు. త్వరలో విమానశ్రయం రాబోతుందని చెప్పారు. మరో పదేళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ మాట్లాడుతూ పార్టీ అన్ని వర్గాలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రాతినిధ్యం కల్పిస్తుందని చెప్పారు. అన్ని మతాలను కలుపుకొని ముందుకు సాగేదే కాంగ్రెస్ పార్టీ అన్నారు. బీజేపీ పార్టీ వైఖరి అన్నదమ్ముల మధ్య వైరం పెట్టే విధంగా ఉంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఫాంహౌస్‌కే పరిమితమని ఏద్దేవ చేశారు. రాబోయే శాసనసభ, పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, అలాగే కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. నూతనంగా ఎన్నుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను అందజేశారు. అనంతరం గౌడ సంఘం నాయకులు, ఇతరులు టీపీసీసీ మహేష్ కుమార్‌గౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. సమావేశంలో ఎమ్మెల్సీ దండె విఠల్, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనిల్‌కుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, మాజీ డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే అత్రం సక్కు, మాజీ జడ్పీ ఛైర్మన్ గణపతి, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు మంగ, దేవయ్య, విశ్వనాథ్, ఆత్మ చైర్మన్ శ్రీరామరావు, చిన్న మల్లన్న, బాలేష్‌గౌడ్, అబ్దుల్లా, తారీఖ్, మహేష్‌గౌడ్, గణేశ్ రాథోడ్ పాల్గొన్నారు.



## కుంటాలలో కుస్తీ పోటీలు

**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కుంటాల మండల కేంద్రంలో శుక్రవారం మహాదేవుని పౌర్ణమి సందర్భంగా కుస్తీ పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను గ్రామ సర్పంచ్ జక్కుల గజేందర్ ప్రారంభించారు. ఈ పోటీలకు నిజామాబాద్ మహారాష్ట్ర నిర్మల్ నుండి మల్లన్న యోధులు తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. మొదటి విజేతకు 5000 రెండో విజేతకు 3000 నగదు పురస్కారం అందజేశారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**ఇంద్రవెల్లి, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

ఇంద్రవెల్లి మండలం దన్నోరా (బి) గ్రామ శివారులోని పిప్రి క్రాస్ రోడ్ వద్ద ద్విచక్ర వాహనాన్ని మ్యాక్స్ ఢీ కొట్టింది. ఈ సంఘటనలో ఆత్రం లక్ష్మణ్ (17) అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనతో పాటు బైక్‌పై ఉన్న కినక ప్రేమిత్‌కు తీవ్రగా యాలయ్యాయి. పిప్పిరి గ్రామానికి చెందిన ఆత్రం లోకేష్, కినక ప్రేమిత్‌లు దన్నోరా (బి) గ్రామానికి వచ్చి తిరిగి వెళుతుండగా.. ఇంద్రవెల్లి నుంచి గుడిహ త్నూర్ వైపు మ్యాక్స్ వాహనం ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని తెలిపారు. తీవ్రగాయాలైన ప్రేమిత్‌ను రిమ్స్‌కు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే రామారావు పటేల్

**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇళ్ల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే రామరావ్ పటేల్ తెలిపారు. శుక్రవారం భైంసా మండలం మాంజ్రీ గ్రామంలో కవుడేకర్ మానజీ ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తున్నట్లు చెప్పారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్ల పదేళ్లుగా ఇళ్లు లేక పేదలు ఇబ్బందులు పడ్డారని, ఇప్పుడు అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయిస్తానన్నారు.





## జన్నారంలో గుడ్ ఫ్రైడే ప్రార్థనలు

**జన్నారం, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలంలోని సీఎస్ఐ, బాప్టిస్ట్ చర్చిలలో గుడ్ ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకున్నారు. లోకానికి శాంతి సందేశాన్ని అందించిన క్రీస్తు త్యాగాన్ని పాస్టర్లు స్మరించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులు సిలువ యాత్ర చేపట్టారు. శనివారం మండలంలోని వివిధ గ్రామాల్లోని చర్చుల వద్ద 'రన్ ఫర్ జీసస్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మండలంలోని సేవాదాస్ నగర్ లో ఉన్న ఓలి నిస్సి చర్చిలో పాస్టర్ పురుషోత్తం ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

## నిర్మల్‌లో భారీ అగ్నిప్రమాదం

### 4 మొబైల్ షాప్‌లు దగ్ధం

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని నారాయణరెడ్డి మార్కెట్ వద్ద భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో నాలుగు మొబైల్ షాపులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ. 20 లక్షలకు పైగా ఆస్తి నష్టం జరిగినట్లు అంచనా. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.





## పశువులకు గాలికుంటు టీకాలు

**కుభీర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కుభీర్‌లో పశు వైద్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక సర్పంచ్ సాయినాథ్ కలిసి కుభీర్ పశు వైద్యులు విశ్వజిత్ పశువులకు ఉచ్చితంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పశు వైద్యులు విశ్వజిత్ మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో మూడు నెలలు దాటిన పశువులకు ఈ టీకాలను వేయించాలని రైతులను సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కళ్యాణ్, ఆత్మకవిటీ చైర్మన్ సిద్ధం వివేకానంద, పశువైద్య సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్సీ హామీ

**నిర్మల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కొమురయ్య హామీ ఇచ్చినట్టు తపస్ జిల్లా అధ్యక్షులు రాష్ట్ర బాధ్యులు రాజేశ్వర్ తెలిపారు. ఉపాధ్యాయులకు పిఆర్సి, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సిపిఎస్ రద్దు, కేజీబీవీ సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విన్నవించగా ఆయన హామీ ఇచ్చినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో సుదర్శన్ రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

## ఉట్నూర్ ఐటీడీఏలో 'ట్రైనీ కలెక్టర్ల' సందడి



**ఉట్నూర్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కొరకు ఐటీడీఏ పని చేస్తుందని ఉట్నూర్ ఐటీడీఏ పీఓ యువరాజ్ మర్మట్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ పీఓ ఛాంబర్ లో ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ల బృంద సభ్యులతో పీఓ సమావేశం అయ్యారు. ఐటీడీఏ పరిధిలోని జరుగుతున్న సంక్షేమ పథకాల అమలు, గిరిజనులకు కల్పిస్తున్న విద్య, వైద్యం, గిరిజనులకు, పివిటీజీలకు అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలాలపై వారితో పీఓ ముఖాముఖి చర్చించారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అధికార యంత్రాంగం సమన్వయంతో సమర్థవంతంగా అమలు చేస్తూ అర్హులైన గిరిజనులకు పథకాల ఫలాలు అందే విధంగా క్షేత్రస్థాయిలో కృషి చేస్తున్నామని పీఓ పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి కొరకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోని అర్హత గల ప్రతి గిరిజనుడికి అందే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం రెండు రోజుల క్షేత్ర పర్యటనలో భాగంగా విచ్చేసిన 20 మంది ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ల బృందం ఐటీడీఏ ఉద్యాన అధికారి గుడిమళ్ల సందీప్ కుమార్ ఆధ్వర్యంలో హార్టికల్చరల్ లోని ఉద్యాన నర్సరీ, శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. నర్సరీలో చేపడుతున్న వివిధ కార్యక్రమాలను అధికారుల బృందానికి హార్టికల్చరల్ ఆఫీసర్ సందీప్ కుమార్ వివరించారు.

**బృంద సభ్యులు వివిధ రకాల పంటలకు..**

వివిధ రకాల పండ్ల తోటల పెంపకం, సాగు మెలకువలు, అంట్లు కట్టే విధానము, కొమ్మలు కత్తిరించే విధానము, ఎరువుల వినియోగం, నీటి యాజమాన్యం, కూరగాయల నారు పెంపకం, వేసవిలో పండ్లు, కూరగాయల పెంపకంలో తీసుకోవలసిన జాగ్రత్తలు మొదలైన అంశాలపై వివరించారు. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ తమలో ఎక్కువ మంది అధికారులు వ్యవసాయ నేపథ్యం నుంచి వచ్చిన వారు ఉన్నారని తెలిపారు. బృంద సభ్యులు వివిధ రకాల పంటలకు సంబంధించిన పలు ప్రశ్నలను ఆసక్తిగా అడిగి సమాచారాన్ని తెలుసుకున్నారు. అక్కడి నుండి ఉట్నూర్ మండల కేంద్రంలోనీ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి ఆసుపత్రిలో కల్పిస్తున్న వైద్య సేవలు, మందుల నిల్వల వివరాలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత, పారిశుధ్య నిర్వహణ, విద్యా బోధన తీరు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు అంశాలను పరిశీలించారు. అధికారుల బృందం సభ్యులు రాకతో వారిని మర్యాదపూర్వకంగా స్వాగతాలు పలికారు. వారి వెంట ఐటీడీఏ అధికారులు, సిబ్బంది ఉన్నారు.








## 'ఆత్మ'ను పక్కన పెట్టిన లెక్కల మాస్టారు!

సినిమా ఇండస్ట్రీలో ఎప్పుడు ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో చెప్పడం కష్టం. ఇక్కడ శాశ్వత మిత్రులు, శత్రులు అంటూ ఉండరు.. అవకాశాలని బట్టి..అవకాశాన్ని బట్టి ఒక్కోసారి అభిప్రాయాలు మారుతూ ఉంటాయి. స్నేహాలు కూడా మారుతుంటాయి. ఒకరితో సుదీర్ఘ ప్రయాణం చేసిన వాళ్లు పరిస్థితుల్ని బట్టి వారిని పక్కన పెట్టి కొత్త వారి కోసం పరుగులు తీయడం ఇక్కడ సర్వసాధారణం. ఒకరితో కలిసి ఏళ్లకు ఏళ్లు ప్రయాణించిన వాళ్లు అకస్మాత్తుగా వాళ్లని పక్కన పెట్టి కొత్తగా ట్రెండ్‌లో ఉన్న వారితో కలిసి ప్రయాణం చేయడం ఇక్కడ నిత్యం జరుగుతూనే ఉంటుంది.సక్సెస్ మాత్రమే మాట్లాడే ఈ ఇండస్ట్రీలో ఇలాంటి వన్నీ సర్వసాధారణం. కానీ ఒక్కరి విషయంలో మాత్రం ఇది సాధారణం కాదు. అందుకే వారి నిర్ణయాలు షాక్‌కు గురి చేస్తుంటాయి. ఇప్పుడు అలాంటి షాకింగ్ నిర్ణయాన్నే లెక్కల మాస్టారు సుకుమార్ తీసుకోవడం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది అలాంటి ఆత్మని సడన్‌గా సుకుమార్ ఇప్పుడు పక్కన పెడుతుండటం అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రస్తుతం 'పెద్ది'లో నటిస్తున్న రామ్ చరణ్‌తో త్వరలో ఓ భారీ పాన్ ఇండియా మూవీకి సుకుమార్ శ్రీకారం చుట్టబోతున్నారు. 'రంగస్థలం' తరువాత వీరిద్దరి కలయికలో రానున్న సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ వర్క్ ఇప్పటికే సుకుమార్ మొదలు పెట్టేశారు. దీంతో ఈ మూవీకి కూడా దేవిశ్రీప్రాద్ మ్యూజిక్ చేస్తాడని అంతా అనుకున్నారు కానీ అనూహ్యంగా అతన్ని పక్కన పెట్టేస్తున్నారు సుకుమార్.అతని స్థానంలో అర్జున్‌రెడ్డి, కబీర్‌సింగ్, యానిమల్ వంటి సంచలన చిత్రాలను సంగీతం అందించి దేశ వ్యాప్తంగా పేరు తెచ్చుకున్న హర్షవర్ధర్ రామేశ్వర్‌ని రంగంలోకి దించేస్తున్నారు. ఇప్పటికే టాక్స్ కూడా పూర్తి చేసిన సుకుమార్ త్వరలో మ్యూజిక్ సిట్టింగ్స్‌ని స్టార్ట్ చేయాలనే ఆలోచనలో ఉన్నారట. ఉన్నట్టుండి ఆత్మ లాంటి దేవిని పక్కన పెట్టడానికి కారణం ఏంటనే చర్చ ఇప్పుడు ఇండస్ట్రీలో మొదలైంది. 'పుష్ప 2' సినిమా బ్యాగ్రౌండ్ స్కోర్ విషయంలో పెద్ద రాద్ధాంతమే జరిగింది. టైమ్ తక్కువగా ఉండటంతో దేవి కొంత మేరకు మాత్రమే బ్యాగ్రౌండ్ స్కోర్‌ని అందించాడు. అయితే మిగతా పోర్షన్‌కి తమన్‌తో చేయిద్దామని ప్లాన్ చేశారు కానీ కుదరకపోవడంతో సామ్ సీఎస్‌ని రంగంలోకి దించి పూర్తి చేయించారు. ఇదే సమస్య కారణంగా దేవిని పక్కన పెట్టి రామ్ చరణ్ మూవీకి హర్షవర్ధన్ రామేశ్వర్‌ని సుకుమార్ రంగంలోకి దించేస్తున్నారనే చర్చ జరుగుతోంది. ఇందులో ఉన్న నిజమెంత అన్నది తెలియాలంటే సుకుమార్ టీమ్ స్పందించాల్సిందే అనే కామెంట్‌లు వినిపిస్తున్నాయి.

## గద పట్టిన పెహల్వాన్



'పెద్ది' సినిమా విడుదల ఆలస్యం కావడం లేదనే సంకేతాల్నిచ్చారు కథానాయకుడు రామ్ చరణ్. అందుకు తగ్గట్టుగానే చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్ని కొనసాగిస్తోంది. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని చిత్రబృందం గురువారం 'పెద్ది' కొత్త పోస్టర్‌ని విడుదల చేసింది. పెహల్వాన్ అవతారంలో, గద చేతపట్టి ఆ పోస్టర్‌లో కనిపిస్తున్నారు రామ్ చరణ్. ఇటీవల ఆయనని కలిసిన 'రాకాస' చిత్రబృందంతో సరదాగా మాట్లాడుతూ 'మా సినిమా విడుదల ఆలస్యం కావడం లేదని, ఆ విషయాన్ని మీరూ అందరికీ చెప్పండి' అంటూ వ్యాఖ్యానించారు. ఆ మాటలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. గత కొన్ని రోజులుగా 'పెద్ది' మరోసారి వాయిదా పడుతుందంటూ జరుగుతున్న ప్రచారానికి రామ్‌చరణ్ ఫుల్‌స్టాప్ పెట్టినట్టైంది. మరి ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న 'పెద్ది' సినిమా ముందు అనుకున్నట్టుగానే ఈ నెల 30నే వస్తుందా, లేక వాయిదా పడుతుందా అనే విషయంపై మరింత స్పష్టత రావాలంటే కొన్నాళ్లు ఆగాల్సిందే. ఈ చిత్రంలో రామ్‌చరణ్ సరసన జాన్వీ కపూర్ నటిస్తున్నారు. శివరాజ్‌కుమార్ ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. బుచ్చిబాబు సానా దర్శకుడు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంస్థలు సంయుక్తంగా సమర్పిస్తున్నాయి. సంగీతం: ఎ.ఆర్.రెహమాన్.

## క్రేజీ కాంబో రిపీట్?

కథల ఎంపికలో ఆచితూచి అడుగులేస్తూ..దక్షిణాదిలో మంచి క్రేజ్ సంపాదించుకుంది కథానాయిక సంయుక్తా మేనన్. ప్రస్తుతం 'స్లమ్ డాగ్', 'బెంజ్' లాంటి చిత్రాలతో తీరిక లేకుండా గడుపుతోందీ తార. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. తనకు మళ్లీ కథానాయకుడు ధనుష్‌తో కలిసి నటించాలని ఉందని చెప్పింది. "సార్' సినిమా కోసం ధనుష్‌తో పనిచేయడం మంచి అనుభవం. ఆయన అద్భుతమైన నటుడు. సెట్లో చాలా తక్కువ మాట్లాడతారు. ఆయన ఒక స్క్రిప్ట్‌ను ఎంచుకున్నారంటే.. అది మంచి స్క్రిప్ట్ అని ప్రేక్షకులకు కూడా తెలుస్తుంది. కెమెరా ముందు ఆ ఒక్క క్షణం కోసమే ఆయన తన శక్తినంతా దాచుకున్నట్లు అనిపిస్తుంది. దర్శకుడు యాక్షన్ అనగానే.. తన సర్వస్వం ఇచ్చేస్తారు. అందుకే నేను మళ్లీ కలిసి పనిచేయాలనుకునే నటుల్లో ధనుష్ ముందు వరుసలో ఉంటార"ని చెప్పింది సంయుక్త.




## దాడి కేసులో నలుగురి అరెస్ట్

ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)

ముగ్గురిపై దాడి చేసిన కేసులో నలు గురు నిందితుల ను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సా యికుమార్ తెలి పారు. ఈ మేరకు శుక్రవారం వివ రాలు వెల్లడించా రు. ఇటీవల పట్టణంలోని ఓ వైన్స్ వద్ద బైక్ యూటర్న్ విషయమై కొందరు గొడవప డ్డారు. ఈ ఘటన గ్యాంగ్ గొడవకు దారితీసింది. ఈ క్రమంలో నలుగురు కలిసి ముగ్గురిపై రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. దీంతో బాధి తుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసు కుని దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా దాడికి పాల్పడిన నలుగురు నిందితులను గుర్తించారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. అలాగే, వీరికి ఆర్థిక సహాయం, ఆశ్రయం కల్పించిన మరో ముగ్గురి పై కేసు నమోదు చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. కేసును త్వరగా ఛేదించి నిందితుల ను పట్టుకున్నందుకు సీఐ సాయికుమార్, ఎస్సై కృ ష్ణారెడ్డి, నవనీత్, సిబ్బందిని ఎస్పీ జానకీ షర్మిల, ఇన్చార్జి ఏఎస్పీ సాయికిరణ్ అభినందించారు.

## విద్యుత్ తీగల చోరీ

లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)

మండలంలోని రాచాపూర్ సమీపంలో సరస్వతీ కాలు వపై గ్రామానికి చెందిన రైతులు నవీన్, ముత్యం, రాం దేని భీమన్న ఏర్పాటు చేసు కున్న వ్యవసాయ మోటార్ల నుంచి విద్యుత్ తీగ లను గురువారం రాత్రి గుర్తు తెలి యని వ్యక్తులు కోసుకువెళ్లారు. గతంలోనూ పలువురి రైతుల విద్యుత్ మోటార్ల తీగలు ఇలాగే చోరీ చేశారు. తీగలు చోరీకి గురవుతుండడంతో రైతులు భూమిలోం చి అమర్చుకున్నప్పటికీ దుండగులు వాటినీ వదల కపో వడం గమనార్హం. సంబంధిత విద్యుత్ శాఖ అధికారు లు స్పందించి తగిన చర్య లు చేపట్టి విద్యుత్ తీగలు చోరీ కాకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

## ఇంట్లో పట్టపగలే చోరీ

సిర్పూర్ (టి), ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)

మండలకేంద్రంలోని బస్టాండ్ ప్రాం తంలో గల తహ సీల్దార్ కార్యాలయం సమీపంలోని ఇంట్లో శుక్రవారం మధ్యాహ్నం చోరీ జరిగింది. ఎస్సై సాగర్ తెలిపిన వివ రాల ప్రకారం.. తహసీ ల్దార్ కార్యాలయం పక్కనున్న ఇంట్లో మధ్యాహ్నం ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ. లక్షా 50వేల నగదు ఎత్తుకెళ్లారు. సమాచారం అందుకున్న కౌటాల సీఐ సంతోష్ కుమార్, సిర్పూర్(టి) ఎస్సై సాగర్ ఘటనాస్థ లానికి చేరుకుని విచారణ చేపట్టారు. పూర్తి సమాచా రం సేకరించాక వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు.

## ఆదిలాబాద్‌లో యువకుడి దారుణ హత్య

ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)

ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బంగారుగూడకు చెందిన యువకుడు హత్యకు గురయ్యాడు. ఆదిలాబాద్ రూరల్ సీఐ ఫణిధర్ తెలిపిన వివరాల ప్రకారం.. బంగారుగూడకు చెందిన వెల్లల రాజేశ్ (25), జమ్ము అలియాస్ జమీర్ మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి రాజేశ్ హత్యకు గురయ్యాడు. హత్యకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. కాగా, మృతుడు రాజేశ్ కుటుం సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# పారాక్వాట్ వేస్తోంది

- ప్రాణాలు తీస్తున్న గడ్డిమందు
- పారాక్వాట్ 10 మిల్లీ లీటర్లు తాగినా ప్రాణాలు హరీ
- ఉమ్మడి జిల్లాలో ఆత్మహత్యాయత్నం చేసుకున్న వారిలో ఈ మందు తాగిన వారే అధికం
- ఈ పెస్టిసైడ్ వల్ల ఉమ్మడి జిల్లాలో అనేక మంది మృతి
- ప్రాణాంతకమని భావించి నిషేధించిన ప్రభుత్వం



ఆదిలాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)

పార్వాకాట్ డైక్లోరైడ్ మందు ప్రజల ఉసురు తీస్తోంది. దీనిని రైతులు పంట పొలాల్లో కలుపు మొక్కలను నివారించేందుకు వినియోగిస్తున్నారు. ఇది విచ్చలవిడిగా విక్రయి స్తుండటంతో రైతులు కూడా అదేస్థాయిలో తీసుకెళ్లి పిచికారి చేస్తున్నారు. అయితే ఈ మందు వాడే సమయంలో రైతులు తగిన జా గ్రత్తలు తీసుకోవాలి. లేదంటే వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభా వాన్ని చూపుతుందని, పార్కిన్సన్స్ అనే వ్యాధి సోకుతుందని వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా క్షణికావేశంలో ఈ మందు తాగి హత్యాయత్నానికి పాల్ప డుతున్నారు. దీంతో ఇది నాడి వ్యవస్థను దెబ్బతీయడంతో పాటు ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిండాలు, చర్మం, కళ్లపై ప్రభావం పడు తుందని వైద్యులు అంటున్నారు. ఇది ఒక్క 10 మిల్లీ లీటర్లు తాగినా ప్రాణాలు దక్కే అవకాశం ఏమాత్రం ఉండదని, 95 నుంచి 98 శాతం మంది చికిత్స పొందుతూ చనిపోతున్నా రని పేర్కొంటున్నారు. దీనికి విరుగుడు లేదని ఆ మందు డబ్బాపై కూడారాసి ఉంటుందని చెబుతున్నారు. క్షణికావే శం లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడుతున్న వారిలో గడ్డిమందు తాగిన వారే ఎక్కువగా ఉంటున్నారు. ఇటీవల కుంటాల మండలానికి చెందిన ఓ వివాహిత కుటుంబ కలహాల కారణంగా గడ్డిమందు తాగింది. ఇప్పటికీ ఆమె జీవచ్ఛవంలా జీవనం సాగిస్తోంది. ఇలా ఆత్మహత్య చేసుకున్న వారిలో గడ్డి మందు తాగిన వారే అధికంగా ఉంటున్నారు.

**ప్రభుత్వ నిషేధం...**


ప్రపంచ వ్యాప్తంగా విస్తృతంగా వాడుతున్న ఈ గడ్డి మందును 50 దేశాల్లో నిషేధిం చారు. మన రాష్ట్రంలో నిషేధించకపోవడంతో రైతులు విచ్చలవిడిగా వాడుతున్నారు. దీని వలన ఆత్మహత్యలు ఎక్కువ అవుతున్నాయని గ్రహించిన ప్రభుత్వం ఈ మందు విక్ర యాలపై దృష్టి సారించింది. ఈ మందు అవసరం ఉన్నవాళ్లు వ్యవసాయాధికారులతో అనుమతి తీసుకొని చీటి తీసుకున్న తర్వాతనే ఇవ్వాలని నిర్ణయించారు. కానీ అది ఆచరణలో అమలు కావడం లేదు. తాజాగా ప్రభుత్వం ఈ మందును రెండు నెలల పాటు నిషేధించాలని అసెంబ్లీలో తీర్మానం చేసింది.

**ఫర్టిలైజర్ దుకాణాల్లో అధికారుల తనిఖీలు..**

పారాక్వాట్ గడ్డి మందు వినియో గించే రైతులు తప్పనిసరిగా మండల వ్యవసాయ అధికారిని సంప్రదించాలని మండల వ్యవసాయ అధికారి కార్తీషా అన్నారు. పారాక్వాట్ గడ్డిమం దుపై ప్రభుత్వం నిషేధం విధించిన నేపథ్యంలో శుక్రవారం మండలంలోని గ్రామాలలో ఫర్టిలైజర్ దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. ఈసంద ర్భంగా ఆమె మాట్లాడుతూ డీలర్లు పారాక్వాట్ విక్రయించే ముందు సంబంధిత వ్యవసాయ అధి కారులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ నిబం ధనలు, అనుమతులు పాటించాలని సూచిం చారు. పారా క్వాట్ వినియోగించే రైతులు తగిన జాగ్రత్తలు పాటించాల న్నారు. పారాక్వాట్ వినియో గంలో ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. సిర్పూర్(టి) మండలంలోని వ్యవసాయ పురుగుల మందుల దుకాణాల్లో శుక్రవారం మండల వ్యవసాయ శాఖ అధికారి గిరీషన్ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వ్యవసాయ పురుగుల మందుల దుకాణాల్లో పారా క్వాట్ డైక్లోరైడ్, ఫార్ములేషన్‌ల విక్రయం, నిల్వ, పంపిణీ తయారీ వినియోగాన్ని తక్షణమే నిషేధిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం దుకాణాల్లో క్రయవిక్రయాల రికార్డులను పరిశీ లించి వివరాలు సేకరించారు.



# మెదడు చురుకుగా ఉండాలంటే..!



మానవ శరీరంలో ప్రధానమైన అవయవం మెదడు. మెదడు నుంచి వచ్చే ఆజ్ఞల ప్రకారమే మనిషి నడుచుకుంటాడు. అలాంటి మెదడు, మనిషి చేసే కొన్ని పొరపాట్ల కారణంగా దెబ్బతింటున్నది. బ్రెయిన్ యాక్టివ్ గా లేకపోతే, జీవితం మీదే పెద్ద ఎఫెక్ట్ పడే అవకాశం ఉంటుంది. జ్ఞాపక శక్తి తగ్గిపోవడం, ఏకాగ్రత ఉండకపోవడం, మానసిక అలసట లాంటి సమస్యలతో చాలా ఇబ్బందులు ఎదురవుతాయి. బ్రెయిన్ యాక్టివ్ గా ఉండేందుకు కొన్ని తప్పనిసరి జాగ్రత్తలు తీసుకోవాలి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.

హెల్త్ డెస్క్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)

### ఫోన్ వాడకం తగ్గించండి

మెదడు ఆరోగ్యాన్ని దెబ్బ తీసే వాటిలో సెల్ ఫోన్ ఒకటి. ఫోన్ ఎక్కువగా చూడటం వల్ల ఏకాగ్రత దెబ్బ తింటుంది. రాత్రి పూట ఎక్కువగా ఫోన్ చూడటం వల్ల మానసిక సమస్యలకు కారణం అవుతుంది. రాత్రి పూట ఫోన్ వాడకపోవడం మంచిది. మెదడు ఆరోగ్యంగా ఉండాలంటే రోజుకు కనీసం 7 నుంచి 9 గంటలు నిద్రపోవాలి.

### జంక్ ఫుడ్ కు దూరంగా ఉండండి

ప్రాసెస్ చేసిన ఫుడ్, షుగరీ ఫుడ్, చెడు కొలెస్ట్రాల్‌ను పెంచే జంక్ ఫుడ్ మెదడు పని తీరును దెబ్బ తీస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని పెంచే తాజా పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్ ప్రొటీన్లు, ఒమేగా-3 ఫ్యాటీ ఆమ్లాలు తీసుకోవడం మంచిది. యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉండే ఫుడ్స్ తీసుకోవడం వల్ల మెదడు కణాల వృద్ధిని పెంచడంతో పాటు ఏకాగ్రతను పెంచుతాయి.

### స్మోకింగ్, డ్రింకింగ్ మానేయండి

ధూమపానం, మద్యపానం మెదడు ఆరోగ్యానికి చాలా ప్రమాదం. నికోటిన్ రక్త నాళాల్లో పేరుకుపోయి మెదడుకు ఆక్సిజన్ ప్రవాహాన్ని తగ్గిస్తుంది. ఆల్కహాల్ మెదడు కణాలను దెబ్బతీస్తుంది. న్యూరోట్రాన్స్ మీటర్ పని తీరుకు అంతరాయం కలిగిస్తుంది. స్మోకింగ్, డ్రింకింగ్ కు దూరంగా ఉండటం వల్ల న్యూరోడెజెనరేటివ్ వ్యాధుల ముప్పు నుంచి కాపాడుకోవచ్చు.

### ఒత్తిని తగ్గించుకోండి

ఒత్తిడి, ఆందోళన కారణంగా కార్టిసాల్ స్థాయిలు పెరిగి మెదడు ఆరోగ్యం దెబ్బతింటుంది. కాలక్రమేణా మెదడు కణాలను నాశనం చేస్తుంది. ఈ నేపథ్యంలో వీలైనంత వరకు ఒత్తిడిని తగ్గించుకోవాలి. మెడిటేషన్, యోగా ద్వారా మెదడును కూల్ గా ఉంచుకోవాలి.

### ఒంటరితనాన్ని వదులుకోండి

ఒంటరితనంగా ఫీలవడం వల్ల మెదడు పనితీరు దెబ్బ తింటుంది. ఒంటరి తనంతో మెదడును మొద్దుబారుతుంది. ఒంటరిగా ఫీలైనప్పుడు ఫ్రెండ్స్ తో సరదాగా గడపాలి.

### మెదడు పని తీరును పెంచే పజిల్స్ ఆడండి

బ్రెయిన్ షార్ప్‌గా పని చేసేందుకు పజిల్స్ ఆడటం మంచిది. కొత్త టెక్నిక్స్ నేర్చుకోవడం, చదవడం, రాయడం, సంగీతం వినడం లాంటివి చేయడం వల్ల మెదడు యాక్టివ్ గా ఉంటుంది. పజిల్ గేమ్స్ వల్ల నాడీ వ్యవస్థ బలోపేతం అవుతాయి.

### శారీరక శ్రమ అవసరం

మెదడు చురుగ్గా పని చేయాలంటే శారీరక శ్రమ అవసరం. గంటలు గంటలు కూర్చొని పని చేసే వాళ్లు కచ్చితంగా రోజూ వ్యాయామం చేయాలి. లేదంటే మెదడు పని తీరు మందగిస్తుంది. శారీరక శ్రమ అనేది మెదడుకు రక్త ప్రవాహాన్ని ప్రోత్సహిస్తుంది. మెదడు యాక్టివ్ గా ఉండేందుకు అవసరమైన ఆక్సీజన్, పోషకాలను అందిస్తుంది. రోజువారీ వ్యాయామం మెదడును ఆరోగ్యంగా ఉంచి ఏకాగ్రతను పెంచుతుంది.




# కార్యకర్తలే కాంగ్రెస్ 'కోట'కు పునాది

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ■ ఎనిమిది లక్షల కోట్ల అప్పులున్నా.. సంక్షేమాన్ని వదలని ప్రభుత్వం
- మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం..
- సింగరేణి నిధులు ఇకపై జిల్లా అభివృద్ధికి మాత్రమే ■ కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేకానంద
- బీఆర్ఎస్ విధ్వంసకర పాలనను తుడిచిపెట్టి.. వంద సీట్లే లక్ష్యంగా ముందడుగు
- జెండాలు మోసిన కార్యకర్తలకు పదవుల్లో పెద్దపీట వేయాలి ■ ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ రావు

**మంచిర్యాల, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

కాంగ్రెస్ కార్య కర్తలే పార్టీకి పునాదిలాంటి వారని, కష్టపడ్డ వారికి తప్పని సరిగా పదవుల్లో ప్రాధాన్యం ఉంటుందని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ సర్వసభ్య సమావేశం శుక్రవారం క్యాతన్‌పల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఎంఎన్ఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ ఇటీవల జరిగిన జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) సభ్యుల ఎన్నికపట్ల అందరినీ సంప్రదించామన్నారు. అధికారంలో లేని సమయంలో కూడా ప్రేంసాగర్‌రావు పార్టీ కోసం చాలా కష్టపడ్డారని కొని యాడారు. పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రేంసాగర్‌రావుకు ఆశించిన మేర అవకాశం రాలేదని, భవిష్యత్తులో తప్పక వస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కార్యకర్తలే కారణమన్నారు. కాంగ్రెస్ దేశంలో గొప్ప చరిత్ర ఉన్న పార్టీ అని, పీసీసీ అధ్యక్షుడిగా పని చేయాలని తాను ఎన్ఎస్‌యూఐ నాయకుడిగా ఉన్నప్పుడే అనుకున్నానన్నారు. తనలా ప్రతీ ఒక్కరికీ అవకాశాలు వస్తాయన్నారు. కాంగ్రెస్ అంటేనే అభివృద్ధి, సంక్షేమం అని, బీఆర్ఎస్ పదేళ్ల విధ్వం సకర పాలనతో పోలిస్తే ఎన్నో రెట్లు గొప్ప పనులు చేపడు తున్నామన్నారు. కాంగ్రెస్, టీడీపీ 65 ఏళ్ల పాలనలో చేయని అప్పులు బీఆర్ఎస్ పదేళ్ల కాలంలోనే ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసిందని ఆరోపించారు. ఇంతజేసి, ఆ పార్టీ ప్రజా సంక్షేమానికి చేసిందేమీ లేదని, బీఆర్ఎస్ నాయకులు వేల కోట్ల రూపాయలు అక్రమంగా సంపాదించారని విమర్శించారు. వాళ్లు దోచుకున్న సొత్తు పంపకాల్లో తేడాలతోనే కేసీఆర్ కుటుంభంలో తగాదాలు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ చేసిన ఎనిమిది లక్షల కోట్లకు నెలకు వడ్డీలు కడు తూనే ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలు అ మలు చేస్తున్నామన్నారు. రేషన్ షాపుల్లో సన్నబియ్యం పంపిణీ దేశంలోనే బృహత్తర కార్యక్రమం అని, బీఆర్ఎస్ హయాంలో పేదలకు చెందాల్సిన బియ్యం కూడా స్మగ్లింగ్‌కు గురైందన్నారు. దేశం మొత్తం మీద సన్న బియ్యం పథకం ఎందుకు అమలు చేయడంలేదని మోదీ, బీజేపీని ప్రశ్నిం చారు. పొద్దున లేస్తే కులం, మతం, దేవుడు అంటారని, శ్రీరామచంద్రుడు బీజేపీ జాగీరా అని ప్రశ్నించారు. ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న బీజేపీ ఉన్న వి పీకేస్తోందని ఎద్దేవా చేశారు. కుల మతాలను రెచ్చగొట్టే పార్టీకి తెలంగాణలో అవకాశం లేదన్నారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రి, టూరిజం శాఖా మాత్యులు జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల సా కారం కావాలని కాంగ్రెస్ అధిష్టానం తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని, దాన్ని గత ప్రభుత్వం కుటుంబ పాల నతో అప్పుల కుప్పగా మార్చిందని విమర్శించారు. వేలాది కోట్లు ఆ పార్టీ నాయకులు దుర్వినియోగం చేశారని, బీఆర్ ఎస్ సంపాధించిన అక్రమార్జనతో ఏర్పాటు చేసిన సోషల్ మీడియా ద్వారా వాస్తవాలను అవాస్తవాలుగా మార్చి త ప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేకానంద మాట్లాడు తూ రేవంత్ వచ్చిన తరువాత అనేక మంచి సంక్షేమ కార్య క్రమాలు అమలు చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పూర్తిగా విఫలమైందని, లక్ష కోట్ల రూపాయలు వృధా అయ్యాయన్నారు. బీఆర్ఎస్ హ యాంలో సింగరేణి సంస్థకు చెందిన డీఎంఎఫ్‌టీ నిధులు జిల్లా అభివృద్ధికి కాకుండా సిద్ధిపేట, గజ్వేల్‌లకు తరలివెళ్లాయని, ఈ మూడేళ్లలో నిధులు పూర్తిగా జిల్లాకే ఉపయో గపడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేంసాగర్ రావు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడ్డ వారిని గుర్తించాలన్నారు. పదవుల్లో వా రికి ప్రాధాన్యత ఇవ్వాలని, గడిచిన పదేళ్లలో కార్యకర్తలు పార్టీ కోసం శ్రమించారన్నారు. పార్టీ అభివృద్ధికి తనతోపాటు చాలా మంది కష్టాలు పడ్డామని, తమపై కేసులు పెట్టారన్నారు. పార్టీలో మొన్నటికి మొన్న వచ్చిన వాళ్లకు వేదికల పై పెద్దపీట వేస్తున్నారని, జెండాలు మోసిన వాళకు పదవుల్లో సముచిత స్థానం కల్పించాలన్నారు. సమావేశానికి ముం దు పార్టీ జెండాను ఆవిష్కరించిన పీసీసీ అధ్యక్షుడు మహే ష్‌కుమార్ అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా కమిటీ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పదవులు పొందిన వారికి నియామక పత్రాలు అందజేశారు. డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, పురాణం సతీష్‌కుమార్, పీసీసీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, చంద్రశేఖర్, నీలకంఠేశ్వర్‌రావు, మంచిర్యాల కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నరేష్, బెల్లంపల్లి మునిసిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతితోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డి కొమురయ్య చరిత్రను భావితరాలకు అందించాలి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను బావి తరాలకు అందించాలని బీసీ సంక్షేమశాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి రమాదేవి అన్నారు. దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధ్వర్యంలో ఏర్పాటు



చేసిన వేడుకలకు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ తెలంగాణ సాయుద రైతాంగ పోరాటంలో దొడ్డి కొమురయ్య కీలక పాత్ర పోషించారని చెప్పారు. అనాటి భూస్వాముల అగడాలను ఎదిరించి, పోరాడి ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చారన్నారు. ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. మహనీయులు అందించిన సేవలను భావి తరాలకు అందించేందుకు ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మెంగ్రె అకాష్, బీజేపీ రాష్ట్ర నాయకుడు అరిగెల నాగేశ్వర్‌రావు, బీజేపీ నాయకులు మల్లికార్జున్, మిషన్ భగీరథ ఈఈ సిద్దీక్ పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక

9440977660, 9110718194

PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY


# సర్పంచ్ ఆత్మహత్య

**కడెం, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**



నిర్మల్ జిల్లా కడెం మండలంలోని మాసాయిపేట గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆమెన్ ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో ఆగి ఉన్న ట్రాక్టర్ నాగళ్లకు ఢీకొని మరో ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాకపోవడంతో ఊపిరిపీల్చున్నారు. ఆమెను ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సర్పంచ్ లహరిక (31) మృతి చెందింది. ఆమెకు భర్త రాజేష్, కొడుకు, కూతురు ఉన్నారు. సర్పంచు లహరిక ఎందుకు ఆత్మహత్యాయత్నం చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది అని పోలీసులు విచారణ చేపట్టారు. లహరిక మృతితో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీస్‌లు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



## ట్రిపుల్ ఐటీ విద్యార్థులతో 'పంతి'

# భోజనం చేసిన మంత్రి జూపల్లి

- కలెక్టర్, ఎస్పీతో కలిసి రాత్రి భోజనం చేసిన మంత్రి
- భోజనం బాగుందా? మెనూ పాటిస్తున్నారా?
- విద్యార్థుల మధ్య కూర్చుని ఆరా తీసిన రాష్ట్ర మంత్రి
- విద్యార్థులకు నాణ్యమైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం

**ముథోల్, ఏప్రిల్ 3 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని ప్రతిష్టాత్మక బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి మెస్‌లో రాత్రి భోజనం చేశారు. విద్యార్థుల మధ్య కూర్చున్న మంత్రి, వారికి వడ్డిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు.

**భోజనం నాణ్యతపై ఆరా...**

భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ మెనూ ప్రకారం భోజనం అందుతోందా? అని ఆరా తీశారు. కూరగాయలు, భోజనం నాణ్యత ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. దీనిపై విద్యార్థులు స్పందిస్తూ.. ప్రతిరోజు తమకు అందుతున్న భోజన వివరాలను, క్యాంపస్‌లో కల్పిస్తున్న ఇతర సదుపాయాలను మంత్రికి వివరించారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు కలగకుండా చూడాలని అధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు.

**అధికారుల బృందం పర్యవేక్షణ...**

మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ట్రిపుల్ ఐటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ తదితర ఉన్నతాధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.